## క్లుప్తంగా

### ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి



ధర్నాచేస్తున్న ఏబీవీపీ నాయకులు

రాయికల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ నిరుపేద విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని కళాశాల ఎదుట ఏబీవీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ వర్కింగ్ కమిటీమెంబర్ సాయి మాట్లాడుతూ.. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తీసుకున్న వారికి డబ్బులు వాపస్ ఇవ్వాలన్నారు. లేనియెడల ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కార్తీక్,టౌన్ సెక్రటరీ హరీశ్, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి మనోజ్, సాయి, సలాం, మౌనిక పాల్గొన్నారు.

### బూత్ కమిటీలదే కీలకపాత్ర



మాట్లాడుతున్న సోమారపు సత్యనారాయణ

కోరుట్ల/మెట్‌పల్లి: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావ డానికి బూత్ కమిటీలదే కీలకపాత్ర అని రామగుండం మాజీ ఎమ్మెల్యే, కోరుట్ల పాలక్ సోమారపు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో శుక్రవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మెటుపల్లిలో శనివారం జరిగే నియోజకవర్గ స్థాయి బూత్‌కమిటీ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. సమ్మేళనంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బూత్‌కమిటీలకు దిశానిర్దేశం చేస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు శీలంవేణు గోపాల్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, సదాశివ్, పోతుగంటి శ్రీనివాస్, రాజమురళి, కౌన్సిలర్ మాడవేణి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

### పీజీలో సీటు సాధించిన వైద్యుడికి సన్మానం

మెట్‌పల్లి: ఇటీవల వెల్లడించిన పీజీ వైద్య విద్య ఫలితాల్లో జగ్గాసాగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి నరేందర్ అత్యుత్తమ ర్యాంకు సాధించాడు. ఉన్నత చదువుల నిమిత్తం వెళ్తున్న ఆయనను శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ బద్దం సుగుణ, ఎంపీటీసీ బోగ వందన, కార్యదర్శి ప్రశాంత్, నర్సయ్య, రాజు తదితరులున్నారు.

### తహసీల్దార్ బదిలీ

కథలాపూర్: తహసీల్దార్ రవీందర్‌ను జగిత్యాలకు బదిలీచేస్తూ కలెక్టర్ రవి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. జగిత్యాల కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న సీహెచ్.శ్రీనివాస్‌ను కథలాపూర్ తహసీల్దార్‌గా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



మందులు అందజేస్తున్న బోగ శ్రావణి

జగిత్యాల: ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధతీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణి అన్నారు. శుక్రవారం బాలాంబిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించగా పాల్గొని మాట్లాడారు. ప్రజలు చిన్నవయస్సులోనే అనారోగ్యం పాలవుతున్నారని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. బాలాంబిక ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. కౌన్సిలర్ గంగసాగర్, ప్రవీణ్, సింగారావు పాల్గొన్నారు.

### బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు



బ్యాంకుల సేవలపై కళాకారుల ఆటపాట

కథలాపూర్: ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ భూషణరావుపేట బ్రాంచీ మేనేజర్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కథలాపూర్ మండలం భూషణరావుపేటలో ఆర్థిక సాంకేతిక అక్షరాస్యతపై కళాకారుల బృందంతో అవగాహన కల్పించారు. బ్యాంకు సేవలు, డిజిటల్ లావాదేవీలపై కళాకారులు ఆట, పాటలతో వివరించారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలు తెలుపొద్దని సెల్‌ఫోన్లకు వచ్చే ఓటీపీలను ఇతరులకు చూపించవద్దన్నారు. ఎంపీటీసీ కొండ అంజనేయులు, మార్కెట్ డైరెక్టర్ తీట్ల శంకర్, క్యాషియర్ శ్రీకాంత్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ఎత్తిపోతలకు నిధులేవి?

- కొల్వాయి ఎత్తిపోతల పథకానికి రూ.98 లక్షలు మంజూరు...
- మిగిలిన గ్రామాల పరిస్థితి ఏమిటో?
- నిధుల కోసం రైతుల ఎదురుచూపు...

సారంగాపూర్: గతేడాది జూన్‌లో కురిసిన భారీ వర్షాలకు గోదావరి ఉధృతి, రోల్లవాగు ప్రాజెక్టు తెగిపోవడంతో బీర్‌పూర్ మండలంలోని గోదావరి ఒడ్డున గతంలో ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకాలు చిన్నాభిన్నమయ్యాయి. దీంతో మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని చెప్పినా అధికారులు, ఒక్క చిన్నకొల్వాయి (కొల్వాయి–ఆరెపల్లి) ఎత్తిపోతల పథకానికి మినహా ఇప్పటి వరకు మిగిలిన ఎత్తి పోతలకు నిధులమంజూరు చేయలేదు. దీంతో రైతులకు నిధుల కోసం ఎదరుచూపులు తప్పడం లేదు.

**ఎత్తిపోతల పథకాలు....**

బీర్‌పూర్ మండలంలోని వివిధ గ్రామాలకు గోదావ రి ఒడ్డున గతంలో ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేశారు. ఈ ఎత్తిపోతల పథకాల పరిధిలో 5,200 ఎకరాలకు సాగునీరందించడానికి గతంలో పూర్తిస్థాయి పథకాలను ఏర్పాటుచేసి సాగునీరు అందించారు. కాగా 2022 జులై నుంచి సెప్టెంబర్ వరకు కురిసిన భారీవర్షాలతో పాటు, బీర్‌పూర్ శివారుల్లో ని రోల్లవాగు ప్రాజెక్టు తెగిపోవడంతో గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన రంగసాగర్, మంగేళ, కమ్మునూర్, చిత్రవేణిగూడెం, రేకులపల్లి, చిన్నకొల్వాయి ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, పైప్‌లైన్లు, విద్యుత్ స్తంభాలు, 100 హెచ్‌పీ సామర్థ్యం గల (ప్రతి పథకానికి మూడు నుంచి నాలుగు విద్యుత్ మోటార్లు) ఇవి పనిచేయడానికి స్టార్టర్ ప్యానెల్ బోర్డులు ప్రతీ వస్తువుకు వరదలతో భారీగా నష్టం వాటిల్లింది. దీంతో ఆయా గ్రామాల పరిధిలోని రైతులకు సాగు నీరు అందకుండా పోయింది.



మంగేళ గ్రామ ఎత్తిపోతల పథకం

**కొల్వాయి–ఆరెపల్లి ఎత్తిపోతల పథకం..**

చిన్న కొల్వాయి గ్రామశివారుల్లోని గోదావరి ఒడ్డున ఏర్పాటుచేసిన కొల్వాయి–ఆరెపల్లి ఎత్తిపోతల పథ కం మరమ్మతులకు ప్రభుత్వం రూ. 98 లక్షలు మంజూరు చేసింది.

**మరమ్మతులకు ప్రతిపాదనలు**

ఆయా పథకాల మరమ్మతులకు అధికారులు రూ. 1.88 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటి వరకు ఒక్క కొల్వాయి–ఆరెపల్లి ఎత్తిపోతల పథకానికి మాత్రమే నిధులు వచ్చాయి. మిగిలిన గ్రామాల్లోని ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

**నిధులు మంజూరు చేయాలి**



కొల్వాయి–ఆరెపల్లి ఎత్తిపోతల పథకానికి మాత్రమే నిధులు మంజూరు చేశారు. మిగిలిన గ్రామాల పరిధిలోని ఎత్తిపోతల పథకాలు పనిచేయకపోవడంతో పంటపోలాలు బీళ్లుగా మారే ప్రమాదం ఉంది. ప్రభుత్వం మిగిలిన రంగసాగర్, మంగేళ, రేకులపల్లి, కమ్మునూర్, చిత్రవేణి గూడెం పథకాలకు సైతం నిధులు మంజూరు చేయాలి.

– లక్ష్మణ్‌రావు, మంగేళ

**వారం రోజుల్లో నిధులు**



పనిచేయని ఎత్తిపోతల పథకాలకు మరో వారంరోజుల్లో నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే కొల్వాయి ఎత్తిపోతల పథకానికి రూ. 98 లక్షలు మంజూరైంది. మిగిలిన ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధుల మంజూరుకి ప్రతిపాదనలు పంపించాం. నిధుల మంజూరుపై ఇంజినీరింగ్ అధికారులు చర్చించారు. త్వరలో నిధులు మంజూరవుతాయి.

– చక్రూనాయక్, డీఈ, నీటిపారుదల శాఖ

## కోరుట్లను అగ్రగామిగా నిలపడమే లక్ష్యం

- ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు
- సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్లరూరల్: కోరుట్ల నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలపడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. శుక్రవారం ఎంపీపీ తోట నారాయణ అధ్యక్షతన కోరుట్ల మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు హాజరై మాట్లాడారు. మండలంలోని ప్రతీ గ్రామంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. నియోజక వర్గ అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ.10 కోట్లు ప్రత్యేక నిధులు మంజూరు చేశారని దీంతో అన్నిగ్రామాలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఆరోగ్య ఉపకేంద్రాలకు భవనాలు లేని గ్రామాల్లో రూ.22 లక్షలతో పక్కా భవనాల నిర్మాణానికి మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారన్నారు. అంతకు మందు అధికారులు పలు అంశాలపై ప్రగతి నివేదికలు చదివి వినిపించగా సభ్యులు సమస్యలను సభాదృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు తమను పిలవటం లేదని ధర్మారం ఎంపీటీసీ నాగిరెడ్డి శుభాశ్‌రెడ్డి పేర్కొనగా ఎపీటీసీలను కూడా తప్పకుండా పిలవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేసి ఆదర్శంగా నిలవాలని సభ్యులకు సూచించారు. జిల్లా రైతు బంధు అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, ఎంపీడీవో నీరజ, తహసీల్దార్ నీరటి రాజేశ్, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ. ఖయ్యూం, అన్నిశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న ముస్లిం నాయకులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని మసీదుల్లో ప్రహరీల నిర్మాణానికి, ఖబరస్థాన్ ప్రహరీల నిర్మాణానికి, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని శుక్రవారం మెట్‌పల్లిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుకు ముస్లిం నాయకులు విన్నవించారు. వర్షకొండ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి టీటీడీ నుంచి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేయాలని టీటీడీ బోర్డు సభ్యుడు ఎమ్మెల్యేకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. నిధుల మంజూరుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మైనార్టీ మండల అధ్యక్షుడు మహ్మద్ యాసీన్, నాయకులు మహ్మద్ నజర్, మహ్మద్ షౌకత్, మజీద్ కమిటీల అధ్యక్షుడు షేక్ వాహెబ్, రాజ్ మహ్మద్, వాహీద్‌ఖాన్, హుస్సేన్‌ఖాదర్, ఆసీరుద్దిన్, పాషా, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పొనకంటి వెంకట్, ఉప సర్పంచు లక్ష్మణ్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చిన్నరాజన్న, ఉపాధ్యక్షుడు జోగ ధనుంజయ్, బీఆర్‌ఎస్ నాయకులు మామిడి సురేశ్‌రెడ్డి, వీడీసీ సభ్యులు నర్సయ్య, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## జగ్గాసాగర్‌ను మండలం చేయడానికి కృషిచేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి: జగ్గాసాగర్‌ను మండలకేంద్రంగా చేయడానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. మండలపరిషత్‌లో శుక్రవారం పాలకవర్గ సర్వసభ్య నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. జగ్గాసాగర్‌ను మండలకేంద్రంగా చేయాలని పలు గ్రామాల నుంచి విజ్ఞప్తులు వచ్చాయని, దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మండలముగా ప్రకటించేలా చూస్తానన్నారు. ఏఎన్‌ఎం సబ్‌సెంటర్ల భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉందని, అధికారులు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ఉపాధిహామీ పథకంలో నిర్మించిన సీసీరోడ్డు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని పలువురు సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం నుంచి నిధులు రాకపోవడంతో జాప్యం జరుగుతోందని సమాధానమిచ్చారు. పలు గ్రామాలకు మిషన్ భగీరథ నీటిసరఫరాలో అంతరాయం కలుగుతోందని ప్రజాప్రతినిధులు తెలుపగా, ప్రత్యేక పైపులైన్‌ను ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఎంపీడీవో భీమేశ్‌రెడ్డి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## అన్నివర్గాల అభ్యున్నతికి సీఎం కృషి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత



కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్

జగిత్యాలరూరల్: అన్నివర్గాల అభ్యున్నతికి సీఎం కృషిచేస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్ పర్సన్ దావ వసంత అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జగిత్యాల అర్బన్, రూరల్ మండలాలకు చెందిన 28 మందికి కల్యాణలక్ష్మిలో మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ అన్నివర్గాల అభ్యున్నతికి కృషిచేస్తున్నారన్నారు. మాత శిశు రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం కేసీఆర్ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ మహేశ్, సింగిల్‌విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, రైతుసమితి మండల కన్వీనర్ రవీందర్ రెడ్డి, జుంబర్తి శంకర్, సర్పంచులు చెరుకు జాన్, గంగాధర్, లక్ష్మణ్‌రావు, చురకంటి స్వప్న పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకు వినతి**

జగిత్యాలరూరల్: మండలంలోని హబ్సీపూర్ గ్రామంలో గౌడసంఘం, మున్నూరుకాపు సంఘం, అంబేడ్కర్ సంఘం భవన నిర్మాణాలకు అదనంగా నిధులు కేటాయించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కులసంఘం భవనాలకు అదనంగా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ జెడ్పీటీసీ ఎల్లారెడ్డి, సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

**రూ.5 లక్షలు మంజూరు...**

జగిత్యాలజోన్: జిల్లాకేంద్రంలోని గణేశ్‌నగర్ రెసిడెన్సీ సంక్షేమ మండలి భవన నిర్మాణానికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా నిధుల మంజూరు పత్రాన్ని సంఘం బాధ్యులకు అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మోటూరి శ్రీనివాస్, కోశాధికారి కమటాల రవీందర్, కుందారపు రాజేందర్, గౌరవ అధ్యక్షుడు సంతోష్‌రావు పాల్గొన్నారు.

## మన ఊరు మన బడి పనులు వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

జగిత్యాలరూరల్: మన ఊరు మన బడి పనులను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ మకరంద్ శుక్రవారం జగిత్యాలరూరల్ మండలం సంగంపల్లి, చల్‌గల్ గ్రామాల్లో మన ఊరు మనబడి పనులను పరిశీలించి మాట్లాడారు. పనుల్లో నిర్లక్ష్యం వీడాలని, త్వరగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. చల్‌గల్ గ్రామంలో పారిశుధ్యం పనులపై ప్రత్యేక శ్రద్ధవహించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. సంగంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అదనపు కలెక్టర్ మకరంద్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పాఠశాలలో కల్పిస్తున్న మౌలిక వసతులపై విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో కందుకూరి రవిబాబు, ఏఈ రాజమల్లయ్య, ఎంఈవో గాయత్రి, మనోజ్, సువర్ణ పాల్గొన్నారు.

### సీఎంఆర్ త్వరగా చెల్లించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: 2021–22 సీఎంఆర్ చెల్లించడంలో మిల్లర్లు అలసత్వంప్రదర్శిస్తున్నారని, జనవరి 31, 2023 లోపు సీఎంఆర్ చెల్లించాలని అదనపు కలెక్టర్ బీఎస్.లత అన్నారు. శుక్రవారం మిల్లర్లతో సమావేశం నిర్వహించి సీఎంఆర్ గడువులోపు చెల్లించాలని ఈ సీజన్‌లో కేవలం 175346.873 ఎంటీఎస్ మాత్రమే చెల్లించారని, 62700.600 ఎంటీఎస్ చెల్లించాల్సి ఉందన్నారు. ఇప్పటికైనా గడువులోపు చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్, రాైస్‌మిల్లు అసోసియేషన్ అధికారులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో ఎన్ని ఎకరాలకు నీరందించారు?



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ధర్మపురి: నియోజకవర్గంలో ఎన్ని ఎకరాలకు సాగునీరందించారో శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి కస్తూరి సత్యం అన్నారు. ప్రతీ నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రగాల్భాలు పలికిన బీఆర్‌ఎస్ నాయకుల మాటలు ఏమయ్యాయని విమర్శించారు. ధర్మపురిలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 24 గంటల విద్యుత్ ఏమైందన్నారు. చార్జీలు భారీగా పెంచుతున్నారని, రైతువ్యతిరేక విధానాలతో రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో నాయకులు బెజ్జారపు లవణ్,పిల్లి శ్రీనివాస్,దొనకొండ నరేష్,బండారు లక్ష్మణ్,సంగెపు గంగారాం,కస్తూరి శరత్,బాకీ రాజేశ్,కస్తూరి రాజన్న, గాజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### రూట్స్ పాఠశాలకు ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఉమాకాంత్

జగిత్యాల: పట్టణంలోని రూట్స్‌స్కూల్‌కు ఎక్సలెన్స్ అవార్డు రెండోసారి లభించింది. ప్రతీ సంవత్సరం బ్రెయిన్ ఫీడ్ సంస్థ స్కూల్ ఎక్సలెన్స్ అవార్డులను అందిస్తోంది. ఇందులో భాగంగా జగిత్యాలలోని కృష్ణానగర్ రూట్స్ పాఠశాల ఎంపికవడంతో హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో సమావేశం నిర్వహించి సంస్థ ప్రతినిధులతో కరస్పాండెంట్ జిల్లా ఉమాకాంత్, ప్రిన్సిపాల్ శారదకు అవార్డు అందించారు.



పూజలు చేస్తున్న అర్చకులు



పూజల్లో పాల్గొన్న మహిళలు

### నమ్మాళ్వార్ పరమపదోత్సవం

కోరుట్లటౌన్: పట్టణంలోని పురాతన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా నమ్మాళ్వార్ పరమ పదోత్సవం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో ఎం.విక్రమ్, అసిస్టెంట్ నర్సయ్య, అర్చకులు బీర్నంది నరసింహాచారి, శ్రీనివాసాచారి, నేరెళ్ల రామకృష్ణ, శ్రీనాథ్, ఆండాళ్ గోష్ఠి బృందం, భక్తులు పాల్గొన్నారు.

### కొండగట్టులో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యేను ఆశీర్వదిస్తున్న అర్చకుడు

కొండగట్టు: అంజన్న ఆలయాన్ని శుక్రవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్త దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయన గోత్రనామాలపై ప్రత్యేక పూజలు జరిపి ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ పాలకమండలి సభ్యులు పోచమల్ల ప్రవీణ్‌కుమార్ శాలువతో సన్మానించి స్వామివారి ప్రసాదం అందించారు.

## అంబులెన్స్ ప్రారంభం



ప్రారంభిస్తున్న వైద్యులు వికాశ్‌రావు, దీప

కథలాపూర్: మండలంలోని చింతకుంట గ్రామానికి కరీంనగర్‌కు చెందిన ప్రతిమా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబులెన్స్‌ను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రత్యేక పూజలు చేసి అంబులెన్స్‌ను ప్రారంభించారు. ప్రతిమా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు హాట్ బాక్సులు కానుకగా ఇచ్చారు. కార్యక్రమంలో కరీంనగర్ ప్రతిమా ఆస్పత్రి రేడియాలజీ విభాగం అధిపతి చెన్నమనేని వికాశ్‌రావు, వైద్యురాలు దీప, సత్యానందాశ్రమాల పీఠాధిపతి శ్రీహరి తీర్థస్వామి, సర్పంచ్ ఖైర హేమలత, ఉపసర్పంచ్ లోక నర్సారెడ్డి, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న చంద్రయ్య

కథలాపూర్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య అన్నారు. శుక్రవారం కథలాపూర్ మండలకేంద్రంలోని ఎస్సార్ ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బూత్‌లెవెల్ కమిటీలు పటిష్ఠంగా ఉండాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, ప్రజలు బీజేపీవైపు చూస్తున్నారన్నారు. బీజేపీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్, మండల ఇన్‌చార్జి నరేందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు ఎద్మల వినోద్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, మల్యాల మారుతి, గాంధారి శ్రీనివాస్, బద్రి సత్యం, శ్రీకర్‌గౌడ్, శ్రీరాముల ప్రకాశ్, నరెడ్ల రవీందర్‌రెడ్డి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై రాడ్డుతో దాడి

- ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి

మల్లాపూర్: మండలంలోని వాల్గొండలో శుక్రవారం పాతకక్షలతో జరిగిన గొడవలో పనాస శంకర్(45) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆసుపత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పనాస శంకర్‌కు, ఇస్లావత్ ప్రభాకర్‌కు మూడు రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో శుక్రవారం సాయంత్రం ప్రభాకర్ రాడ్డుతో శంకర్‌పై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు శంకర్‌ని హుటాహుటిన కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మల్లాపూర్ ఎస్సై నవీన్‌కుమార్ పోలీసు సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

## అల్ఫోర్స్‌లో ముందస్తు సంక్రాంతి సంబురాలు



సంక్రాంతి వేడుకల్లో విద్యార్థులతో అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

మల్యాల: మండలంలోని అల్ఫోర్స్ ఈ టెక్నోపాఠశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోగి మంటలు, పిండి వంటలు, రంగవల్లులు అలరించాయి. కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి హాజరై, పండుగ విశిష్టత, ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో కలిసి నృత్యం చేశారు. విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.